

వేడుకకు హాజరైన భక్తులు (ఇన్‌సెట్‌లో), ధ్వజారోహణం చేస్తున్న ఆలయ ప్రధానార్చకులు

కులశేఖరపట్టినంలో
ప్రారంభమైన దసరా వేడుకలు

● 'ఓం కాళీ... జై కాళీ' నినాదాలతో మార్మోగిన ఆలయం

చెన్నై, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ కులశేఖరపట్టినం ముత్తారమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు మంగళవారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో అమ్మవారి కంకణాలు కట్టుకుని వ్రతమాచరిస్తున్న వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. 'ఓం కాళీ... జై కాళీ...!' అంటూ భక్తులు చేసిన నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. వ్రతమాచరిస్తున్న భక్తుల్లో చాలామంది కాళికా దేవి వేషాలతో డప్పు వాయిద్యాల నడుమ నృత్యం చేస్తూ అమ్మవారికి పూజలు నిర్వహించారు. భారతదేశంలో మైసూర్ తర్వాత అంతే స్థాయిలో దసరా వేడుకలను నిర్వహించే దివ్యక్షేత్రంగా కులశేఖరపట్టణం ముత్తారమ్మన్ ఆలయానికి పేరుంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఆలయ ధ్వజాన్ని (జెండాను)ఆలయ వీధుల్లో ఏనుగు మీద ఊరేగించారు. ఆ తర్వాత ఉదయం ఆరుగంటలకు ధ్వజ స్తంభానికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, దీపారాధన చేశారు. మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ ఆలయ ప్రధానార్చకులు ధ్వజారోహణం చేశారు. ఈ వేడుకలకు కులశేఖరపట్టినం, ఉడన్‌కుడి, తిరుచెందూరు, తూత్తుకుడి, నాగర్‌కోవిల్, తెన్‌కాశి తదితర ప్రాంతాల నుండి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. ధ్వజారోహణం అనంతరం ఉదయం 10 గంటలకు సీవలూరు దసరా కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ నెల 24 నుంచి అక్టోబర్ 1 వరకూ ప్రతిరోజూ ఉదయం 7.30, 9.30, 10.30, మధ్యాహ్నం 12, 1.30, సాయంత్రం 4.30, 6, రాత్రి 7.30 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం అన్నదానం చేస్తారు. రోజూ రాత్రి 10 గంటలకు అమ్మవారిని వివిధ వాహనాలపై ఊరేగిస్తారు. అక్టోబర్ 2న రాత్రి 12 గంటలకు అమ్మవారు సింహవాహనంపై బయలుదేరి సముద్రతీరంలోని చిదంబరేశ్వరాలయం ముందు వేంచేసి శూర సంహారం చేస్తారు.

వారానికి 4 రోజులు
ప్రజలతో గడపండి

● డీఎంకే ఎంపీలకు స్టాలిన్ దిశానిర్దేశం



ఎంపీల సమావేశంలో మాట్లాడుతున్న డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వారానికి నాలుగురోజుల పాటు ఎంపీలు తమ నియోజకవర్గాల్లో బసచేసి, అక్కడి ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. అన్నా అరివాలయంలో మంగళవారం డీఎంకేకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యుల సమావేశం స్టాలిన్‌న జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం నిర్వహిస్తున్న 'ఉంగలుడన్ స్టాలిన్', 'నలమ్ కాక్కుం స్టాలిన్' శిబిరాలకు ఎంపీలు కూడా హాజరుకావాలని, ఆ శిబిరాల్లో ప్రజలు ఇచ్చే వినతులను పరిశీలించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా కలైంజర్ మహిళా సాధికారిక పథకం కింద గృహిణులకు ప్రతినెలా రూ.1000లు వారి బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతున్నాయా? అని లబ్ధిదారులను అడిగి తెలుసుకోవాలన్నారు. ఆ పథకం కోసం కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారి వివరాలను కూడా పరిశీలించి, వారి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా తదుపరి చర్యలు చేపట్టాలన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమి 39 సీట్లను గెలుచుకునేందుకు డీఎంకే మిత్రపక్షాల ఎమ్మెల్యేలు తీవ్రంగా శ్రమించారని, ఆ విధంగానే వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో డీఎంకే కూటమి సభ్యుల విజయాకిఇ ఎంపీలు శ్రమించాలని స్టాలిన్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎంకే ప్రధాన కార్యదర్శి, సీనియర్ మంత్రి దురైమురుగన్, కోశాధికారి, ఎంపీ టీఆర్‌బాలు, ఎంపీలు కనిమొళి, తిరుచ్చి శివ తదితరులు పాల్గొన్నారు.

ఉప రాష్ట్రపతితో గవర్నర్ భేటీ

పెరంబూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో గవర్నర్ ఆర్‌ఎన్ రవి భేటీ అయ్యారు. మంగళవారం ఉదయం చెన్నై నుంచి ఢిల్లీ వెళ్లిన గవర్నర్ ఉపరాష్ట్రపతి నివాసానికి చేరుకున్నారు. ఇటీవలే ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన సీపీ రాధాకృష్ణన్‌ను అభినందించారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్రం నుంచి ఉపరాష్ట్రపతి పదవి అధిరోహించడం సంతోషంగా వుందని ఈ సందర్భంగా గవర్నర్ పేర్కొన్నారు. ఇదిలా వుండగా గవర్నర్ కేంద్ర హోంమంత్రి, ప్రధానమంత్రితో కూడా గవర్నర్ భేటీ అయ్యే అవకాశముందని రాజ్‌భవన్ వర్గాలు పేర్కొన్నాయి.



రాధాకృష్ణన్‌ను అభినందిస్తున్న గవర్నర్ రవి



చెన్నై, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాలు అక్టోబరు 14 నుంచి ప్రారంభవుతాయని స్పీకర్ అప్పావు ప్రకటించారు. సచివాలయం ప్రాంగణంలోని తన కార్యాలయంలో స్పీకర్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర శాసనసభ సమావేశాలు అక్టోబరు 14వ తేది ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతాయని, గత శాసనసభ

14 నుంచి అసెంబ్లీ సమావేశాలు

స్పీకర్ అప్పావు

సమావేశాలు ముగిసిన రోజు నుంచి ఇప్పటివరకు మృతిచెందిన మాజీ ఎమ్మెల్యేలకు నివాళులర్పించనున్నామన్నారు. అనంతరం 2025-26వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అదనపు నిధుల పద్దును శాసనసభలో ప్రవేశపెట్టనున్నామన్నారు. 14వ తేదీ ముందుగా ఒక తేది నిర్ణయించి, ఆ రోజున స్టాండింగ్ కమిటీ సమావేశం జరిపి శాసనసభ ఎన్ని రోజులు నిర్వహించాలో నిర్ణయం తీసుకుంటామని స్పీకర్ అప్పావు తెలిపారు.

నాలుగైదు రోజులు మాత్రమే ?

గత శాసనసభ సమావేశాలు ఏప్రిల్ 29వ తేదీతో ముగిశాయి. సాధారణంగా ఆరు నెలలకొకసారి సమావేశాలు నిర్వహించడం జరుగుతోంది. ఆ ప్రకారం, అక్టోబరు 14న ప్రారంభం కానున్న సమావేశాలు నాలుగైదు రోజులు మాత్రమే జరిగే అవకాశముందని అసెంబ్లీ వర్గాల సమాచారం. అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏడాది ఏప్రిల్‌లో జరిగే అవకాశముంది. ఎన్నికలకు ఇంకా ఏడు నెలలు మాత్రమే ఉన్న నేపథ్యంలో, జరుగనున్న అసెంబ్లీ సమావేశాల్లో పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

తెన్‌కాశి ఆలయంలో మాజీ రాష్ట్రపతి

● కాశీ విశ్వనాథుడికి ప్రత్యేక పూజలు చేసిన రామనాథ్ కోవింద్

చెన్నై, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ మంగళవారం తెన్‌కాశిలోని కాశీ విశ్వనాథ ఆలయాన్ని దర్శించారు. ఆ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. తెన్‌కాశి జిల్లాల్లో ఏర్పాటైన కొన్ని కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రామనాథ్ కోవింద్ ప్రత్యేక విమానంలో సోమవారం సాయంత్రం తూత్తుకుడి వెళ్లారు. అక్కడి నుంచి బయలుదేరి తెన్‌కాశి చేరుకుని సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రాంగణంలోని వసతి గృహంలో రాత్రి బసచేశారు. మంగళవారం ఉదయం ఆయన కాశీవిశ్వనాథుడి ఆలయానికి చేరుకున్నారు. తెన్‌కాశి జిల్లా కలెక్టర్ ఇతర అధికారులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఇదే విధంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆనందన్ అయ్యాసామి, జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వేంబు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆలయం వద్ద ట్రస్టుబోర్డు అధ్యక్షుడు బాలకృష్ణన్, ఆలయ కార్యనిర్వహణాధికారి పొన్ని, ప్రధానార్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లను రామనాథ్ కోవింద్ దర్శించుకున్నారు. ఆ సందర్భంగా మూలవిరాట్టుకు నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొని, ఆలయంలోని వివిధ దేవతామూర్తుల సన్నిధులను కూడా దర్శించారు.



ఆలయం వద్ద మాజీ రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు, బీజేపీ నేతలు



కున్నూర్ బస్‌స్టేషన్ వద్ద రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

అరివాలయాన్ని కాపాడింది 'అమ్మే'

● కనిమొళికి ఈపీఎస్ కౌంటర్

ప్యారీస్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే కార్యాలయాన్ని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఢిల్లీకి మార్చారంటూ ఎద్దేవా చేసిన డీఎంకే లోక్‌సభ సభ్యురాలు కనిమొళికి ఆయన కౌంటర్ ఇచ్చారు. డీఎంకే ప్రధాన కార్యాలయమైన అన్నా అరివాలయాన్ని కాపాడింది దివంగత ముఖ్యమంత్రి జయలలితేనన్న విషయాన్ని మర్చివద్దన్నారు. తమ పార్టీ కార్యాలయం రాయపేటలోనే వుందని, కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడంలో ఎప్పుడూ అన్నాడీఎంకే ముందుంటుందన్నారు. ఆ విధంగానే కరుణానిధి డీఎంకేలో ఉన్న సమయంలో అన్నా అరివాలయాన్ని కైవసం చేసుకునేందుకు కొంతమంది ప్రయత్నించినప్పుడు వారిని అడ్డుకుని ఆ కార్యాలయాన్ని కాపాడింది అమ్మే (జయలలిత)నన్న నిజాన్ని కనిమొళి మర్చిపోవద్దని సూచించారు. అయితే తమ కూటమిలో ఉన్న పార్టీలకు సాయం చేసిన చరిత్ర డీఎంకేకు లేదని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈపీఎస్ మంగళవారం నీలగిరి జిల్లా కున్నూర్, ఊటీ ప్రాంతాల్లో పర్యటించారు. కున్నూర్ బస్‌స్టేషన్ సమీపంలో రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఆచరణకు సాధ్యంకాని హామీలతో అధికారంలోకి వచ్చిన డీఎంకే ప్రభుత్వం మరో 7 నెలలు మాత్రమే పెత్తనం చెలాయించనుందన్నారు. జీఎస్టీ తగ్గింపు సోమవారం నుంచే అమలులోకి వచ్చినా.. రాష్ట్రంలో మాత్రం వస్తువుల ధరలు తగ్గిన దాఖలా లేదని, దీనిపై రాష్ట్రప్రభుత్వం కూడా దృష్టిసారించలేదని ఆరోపించారు. అన్నాడీఎంకే హయాంలో అన్ని జిల్లాలకు ప్రాధాన్యత కల్పించామని, అలాగే నీలగిరి జిల్లాలో నివసిస్తున్న గిరిజనులు అనారోగ్యానికి గురైతే చికిత్స కోసం కోయంబత్తూరు వెళ్లే అవసరం లేకుండా రూ.400 కోట్లతో ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రిని ప్రారంభించి ఆధునిక విధానంలో శస్త్ర చికిత్స విధానాలను కూడా తీసుకొచ్చామన్నారు. కున్నూర్‌లో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేలా మల్టీలెవల్ పార్కింగ్ సౌకర్యాన్ని కల్పిస్తామని ఈపీఎస్ హామీ ఇచ్చారు. మద్యం తయారీ పరిశ్రమలు నడుపుతున్న డీఎంకే నేతలను వదిలిపెట్టే పరిస్థితేలేదని ఈపీఎస్ హెచ్చరించారు.

5న మదురై నుంచి
నాగేంద్రన్ ప్రచారం



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్

ప్యారీస్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ అక్టోబర్ 5 నుంచి నవంబర్ 30వ తేదీ వరకు 55 రోజులు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనున్నారు. వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలకు డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ, కాంగ్రెస్ తదితర పార్టీలు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో, బీజేపీ అధిష్టానం పిలుపు మేరకు సోమవారం హస్తిన వెళ్లిన నయినార్ నాగేంద్రన్ ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలిసి రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై మాట్లాడినట్లు సమాచారం. ఈ సందర్భంగా నయినార్ నాగేంద్రన్ మీడియాతో మాట్లాడుతూ, అక్టోబర్ 5వ తేదీ నుంచి తాను చేపట్టనున్న రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా మదురైలో 12వ తేదీ జేపీ నడ్డా పాల్గొంటారని తెలిపారు. ర్యాలీ అనంతరం అక్కడ జరిగే బహిరంగ సభలో జేపీ నడ్డా సహా ఎన్డీయే కూటమి నేతలు హాజరవుతారన్నారు. అక్టోబర్ 6న ఎంజీఆర్ వైద్యకళాశాల ఆస్పత్రిలో నిర్వహించనున్న స్నాతకోత్సవంలో నడ్డా పాల్గొంటారని నయినార్ నాగేంద్రన్ తెలిపారు.

ఎన్నికల తర్వాత ప్రతిపక్ష నేతగా విజయ్

● కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాకూర్ జోస్యం

చెన్నై, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది అసెంబ్లీ ఎన్నికల తర్వాత టీవీకే నేత ప్రధాన ప్రతిపక్షనేతగా ఉంటారని కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాకూర్ వ్యాఖ్యానించారు. విరుదునగర్ జిల్లా సాత్తూరు మున్సిపాలిటీ ఉన్నత పాఠశాలలో రూ.50లక్షలతో నిర్మించనున్న అదనపు తరగతి గదులకు మంగళవారం ఉదయం ఆయన శంకుస్థాపన చేశారు. ఆ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజలంతా రూ.2కోట్ల మేర ధనాన్ని పొదుపు చేయగలుగుతారని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. కొత్త జీఎస్టీ 2.0 ద్వారా ప్రతిభారతీయుడికి ప్రతినెలా రూ.137లు మాత్రమే ఆదా అవుతుందని, ధనవంతులు మాత్రమే కొత్త జీఎస్టీ వల్ల కోట్లకు పడగలెత్తుతారని, ఇదే వాస్తవమన్నారు. జీఎస్టీ తగ్గింపు వల్ల దేశంలో సరికొత్త విప్లవం ఏర్పడిందంటూ చెప్పటం కూడా హాస్యాస్పదంగా ఉందన్నారు. ఏళ్ల తరబడి పన్నులు పెంచి ప్రస్తుతం వాటిని తగ్గించి ప్రజలకు మేలు చేసినట్లు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రకటనలు చేయడం గర్హనీయమన్నారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్), బీజేపీ నేత అన్నామలై కలిసి టీవీకే నేత విజయ్‌ని ప్రతిపక్షనేతగా మార్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఈపీఎస్ తన పార్టీలో ఉన్న సీనియర్ నేతలను ద్రోహులనే ముద్రవేసి తరిమికొడుతూ పార్టీ బలహీనంగా మారుతోందనే విషయం కూడా గమనించకపోవడం శోచనీయమన్నారు. దీనితో అన్నాడీఎంకే ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా పోగొట్టుకునే ప్రమాదం ఉందని, ఆ హోదా టీవీకే నేత విజయ్ పొందే అవకాశం ఉందని మాణిక్కం ఠాకూర్ అన్నారు. రాష్ట్రానికి సంబంధించిన రూ.2080 కోట్ల విద్యానిధులను కేంద్రంలోని బీజేపీ పాలకులు నిలిపివేయడం తమిళ ప్రజలకు చేస్తున్న తీరని ద్రోహంగా భావించాలన్నారు. ఇకనైనా కేంద్రం విద్యానిధులను వీలయినంత త్వరగా విడుదల చేసిన నిరుపేద విద్యార్థుల చదువులు సవ్యంగా సాగేలా చూడాలని హితవు పలికారు.



మీడియాతో మాట్లాడుతున్న మాణిక్కం ఠాకూర్

సమాచార దృష్టి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా సెంబియం పరిధిలో పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఓ ప్రకటలో తెలిపింది. వాటి వివరాలు.... ఉమా నగర్, ముత్తమిళ్ నగర్ 1 నుంచి 8 బ్లాక్‌లు, ఎస్‌బీఓఏ టీచర్స్ కాలనీ, సెక్రటరీయేట్ వీధి, అక్బర్ నగర్, మాధవన్ నగర్, పీఆర్‌హెచ్ రోడ్డు, పారిమాకం నగర్, సుధా నగర్, విఘ్నేష్ నగర్, వినాయక నగర్, బాల వినాయక ఆలయ వీధి, పెరుమాళ్ ఆలయ వీధి, పచ్చయప్పన్ కాలనీ ఉన్నాయి. అదే విధంగా కామరాజర్ వీధి, రెడ్‌హిల్స్ రోడ్డు, మాతా వీధి, భజన ఆలయ వీధి, స్కూల్ రోడ్డు, గిరిజ నగర్, ఎంఎన్ నగర్, సన్నిధి వీధి, చిట్టిబాబు నగర్, కక్కంజి కాలని, రాజా వీధి, కబిలర్ వీధి, సత్యవాణి ముత్తు నగర్, కరుణానిధి రోడ్డు, ఎంపీఎం వీధి, నాగై అమ్మయార్ వీధి, రాజాజీ వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది.

జీసీసీ పరిధిలో రూ.900 కోట్ల ఆస్తి పన్ను వసూలు

పెరంబూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇప్పటివరకు రూ.900 కోట్ల మేర ఆస్తి పన్ను వసూలైంది. జీసీసీ ఆదాయంలో ఆస్తి, వృత్తి పన్నులు ప్రధానమైనవి కాగా, ప్రతి ఏడాది రూ.2,023 కోట్ల మేర ఆస్తి పన్ను వసూలుచేస్తున్నారు. ఆ ప్రకారం, 2025-26వ ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను వసూలును అధికారులు, ఉద్యోగులు ముమ్మరం చేశారు. అలాగే, ఆస్తి పన్ను రెండు అర్ధవార్షికాలుగా వసూలుచేస్తుంటారు. అలా, తొలి అర్ధవార్షికంలో తొలి 30 రోజుల్లో పన్ను చెల్లించిన వారికి సుమారు రూ.5,000 వరకు ప్రోత్సాహకం ఇస్తున్నారు. ఆ ప్రకారం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇప్పటివరకు రూ.900 కోట్ల ఆస్తి పన్ను వసూలైనట్లు అధికారులు తెలిపారు.

తిరుప్పరంకుండ్రం హుండీ ఆదాయం రూ.కోటి

పెరంబూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిర్పురంకుండ్రం మురుగన్ ఆలయ హుండీ ఆదాయం రూ. కోటి వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. సుబ్రమణ్యస్వామిని దర్శించుకునే భక్తులు కానుకలు సమర్పించేలా ఈ ఆలయ ప్రాంగణంలో హుండీలు ఏర్పాటు చేశారు. వాటిలో కానుకలను ప్రతి నెలా లెక్కిస్తారు. ఆ ప్రకారం, గత నెల హుండీ ఆదాయం లెక్కింపు సోమవారం ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగింది. భక్తులు రూ.1,05,01,654 నగదు, 201 గ్రాముల బంగారం, 3,902 కిలోల వెండి కానుకలుగా సమర్పించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

27న గీతాభవన్‌లో వైద్యశిబిరం

చెన్నై, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోపాలపురం అవ్వైషణ్ముగం సాలైలోని గీతాభవన్ హాలులో ఈ నెల 27న 'సేవా తరంగిణి' పేరుతో మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గీతాభవన్ మేనేజింగ్ ట్రస్టీ మను గోయెల్ తెలిపారు. గీతాభవన్ ట్రస్టు, ఆరోగ్యభారతి తమిళనాడు, కంచికామకోటి చైల్డ్ ట్రస్ట్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 27 ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ వైద్యశిబిరం కొనసాగుతుందని తెలిపారు. ఈ శిబిరంలో వైద్యపరీక్షలు చేసుకోవాలనుకునే మహిళలు 94445 42812, 94451 98100 అనే మొబైల్ నెంబర్లకు ఫోన్ చేసి తప్పకుండా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

చెన్నై- కుమరి వారాంతపు ప్రత్యేక రైలు

పెరంబూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దీపావళి, వారాంతపు సెలవుల సందర్భంగా చెన్నై సెంట్రల్ నుంచి మదురై మీదుగా కన్నియాకుమారికి వారాంతపు ప్రత్యేక రైళ్ల నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.06151 చెన్నై సెంట్రల్-కన్నియాకుమారి వారాంతపు ప్రత్యేక రైలు ఈ నెల 29, అక్టోబరు 6,13,20 తేదీల్లో చెన్నై సెంట్రల్‌లో రాత్రి 11.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.50 గంటలకు మదురై చేరుకుని, అక్కడి నుంచి మధ్యాహ్నం 1.20 గంటలకు కన్నియాకుమారి చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06152 కన్నియాకుమారి- చెన్నై సెంట్రల్ వారాంతపు ప్రత్యేక రైలు ఈ నెల 30, అక్టోబరు 7,14,21వ తేదీల్లో కన్నియాకుమారిలో మధ్యాహ్నం 3.35 గంటలకు, రాత్రి 8.10 గంటలకు మదురై చేరుకుని, అక్కడి నుంచి మరుసటిరోజు ఉదయం 8.30 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుందని దక్షిణ రైల్వే తెలిపింది.

సెంట్రల్-కోవై ప్రత్యేక రైళ్లు ...

ఆయుధపూజ, దీపావళి పండుగల సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం కోయంబత్తూర్- చెన్నై సెంట్రల్-కోయంబత్తూర్ మధ్య ప్రత్యేక వారాంతపు సూపర్‌ఫాస్ట్ రైళ్ల నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.06034 కోయంబత్తూర్-చెన్నై సెంట్రల్ వారాంతపు రైలు ఈ నెల 28, అక్టోబరు 5,12 తేదీలత్లో కోయంబత్తూర్ నుంచి రాత్రి 11.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.30 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. మరుమార్గంలో, నెం.06033 చెన్నై సెంట్రల్-కోయంబత్తూర్ వారాంతపు సూపర్‌ఫాస్ట్ రైలు ఈ నెల 29, అక్టోబరు 6,13 తేదీల్లో చెన్నై సెంట్రల్ నుంచి ఉదయం 10.15 గంటలకు బయల్దేరి సాయంత్రం 6.35 గంటలకు కోయంబత్తూర్ చేరుకుంటుంది. ఈ రైళ్ల ముందస్తు రిజర్వేషన్ బుధవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని దక్షిణ రైల్వే తెలిపింది.

బస్సులో వాటర్ బాటిళ్లకు టెండర్ల ఆహ్వానం

పెరంబూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణికులకు వాటర్ బాటిల్స్ సరఫరాకు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్‌ఈటీసీ) టెండర్లు ఆహ్వానించింది. ఎస్‌టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి అవసరమైన సమయంలో లీటరు వాటర్ బాటిల్ అందించాలని నిర్ణయించారు. ఇందుకోసం వాటర్ బాటిళ్లు సరఫరా చేసే సంస్థ ఎంపికకు ఈ-టెండర్ ఆహ్వానించారు. టెండరు ఖరారు చేసి సంస్థను ఎంపిక చేసి, త్వరలోనే ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పునర్విభజనపై అఖిలపక్ష భేటీ



అఖిలపక్ష సమావేశంలో ప్రసంగిస్తున్న చెన్నై జిల్లా ఎన్నికల అధికారి, కార్పొరేషన్ కమిషనర్ కుమార గురుబరన్

చెన్నై, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాల పునర్విభజనపై అన్ని పార్టీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని కొత్త కేంద్రాలను ఏర్పాటు చేస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కార్పొరేషన్ కమిషనర్ జె.కుమారగురుబరన్ తెలిపారు. రిప్పన్ భవనంలో మంగళవారం ఉదయం గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. పోలింగ్ కేంద్రంలో 1200 మందికి పైగా ఓటర్లుంటే ఆ పోలింగ్ కేంద్రాన్ని రెండుగా విభజించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహించారు. నగరంలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 3718 పోలింగ్ కేంద్రాల్లో 1200లకు పైగా ఓటర్లున్న కేంద్రాలను విభజించిన తర్వాత 353 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. దీనితో మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 4071కి పెరిగింది. ఈ నేపథ్యంలో ఈ పోలింగ్ కేంద్రాలు పనిచేస్తున్న భవనాల మార్పిడి, పేర్ల మార్పిడి, పోలింగ్ కేంద్రాల అనుసంధానం వంటి కీలకమైన అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించారు.. ఈ సమావేశంలో అదనపు జిల్లా ఎన్నికల అధికారులు పృథ్వీరాజ్, జి. శరవణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు సిద్ధం

పెరంబూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందించేందుకు రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు సిద్ధంగా ఉన్నాయని పాఠశాల విద్యాశాఖ తెలిపింది. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలోని పాఠశాలల్లో 1 నుంచి ప్లస్ టూ తరగతి వరకు సుమారు 70 లక్షల మంది విద్యార్థినీ, విద్యార్థులు చదువుతున్నారు. తమిళనాడు టెక్స్‌బుక్స్ సొసైటీ ద్వారా పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు అందజేస్తుంటారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా, ప్రైవేటు పాఠశాలలకు నగదుపై అందజేస్తుంటారు. పాఠశాల విద్యలో 1 నుంచి 7 తరగతుల వరకు మూడు సెమిస్టర్ల విధానం, 8 నుంచి 12వ తరగతి వరకు వార్షిక విద్యా విధానం అమలులో ఉంది. ఆ ప్రకారం, 1 నుంచి 7వ తరగతి విద్యార్థులకు మొదటి సెమిస్టర్ విద్యా బోధన ముగిసి ప్రస్తుతం త్రైమాసిక పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్షలు ఈ నెల 26వ తేదీతో ముగియనుండగా, 27 నుంచి అక్టోబరు 5వ తేది వరకు సెలవులు ప్రకటించారు. అక్టోబరు 6వ తేది పాఠశాలలు ప్రారంభమైన రోజున రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు అందజేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఆ ప్రకారం, 32,60,960 మంది విద్యార్థులకు అందజేసేందుకు పాఠ్య పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయని పాఠశాల విద్యా డైరెక్టర్ ఎస్.కన్నప్పన్ తెలిపారు.

తిరుచెందూర్‌లో పంచలింగం సందర్శనకు అనుమతి



తిరుచెందూర్ ఆలయం

పెరంబూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయంలోని పంచలింగం సందర్శనకు భక్తులను అనుమతించనున్నట్లు ఆలయ నిర్వాహకులు న్యాయస్థానానికి తెలియజేశారు. తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయాన్ని దర్శించుకునే భక్తులు మొదటి మురుగన్ స్వామిని దర్శించుకుని, తర్వాత ఆలయం లోపల పురాతన పంచలింగానికి పూజలు చేయడం ఆచారం. కొవిడ్ సమయంలో పంచలింగం సందర్శనకు నిషేధం విధించారు. ఆ నిషేధం ఇప్పటివరకు కొనసాగుతుండగా, పంచలింగానికి అభిషేకాలు, పూజలు నిర్వహించడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, తిరుచెందూర్ ఆలయంలోని పంచలింగానికి పూజలు నిర్వహించాలని, పంచలింగం దర్శించుకునేందుకు భక్తులను అనుమతించాలని కోరుతూ దిండుగల్ జిల్లా నిలకోటకు చెందిన భక్తులు హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తులు అనితా సుమంత్, కుమరప్పన్‌లతో కూడిన ధర్మాసనం విచారించి, తిరుచెందూర్ ఆలయానికి భక్తుల రద్దీ నియంత్రించేలా చర్యలు చేపట్టవచ్చు. ఇందుకోసం దర్శనాన్ని తిరస్కరించడం సముచితం కాదని, భక్తులు తక్కువగా ఉన్న సమయంలో పంచలింగం సందర్శనకు భక్తులను అనుమతిస్తారా? అనే విషయంపై ఆలయ జాయింట్ కమిషనర్ సమగ్ర వివరణ ఇవ్వాలని నోటీసు జారీచేశారు. ఈ పిటిషన్ సోమవారం విచారణకు రాగా, పంచలింగం సందర్శనకు భక్తులను అనుమతించనున్నట్లు ఆలయ నిర్వాహకుల తరఫున అఫిడవిట్ దాఖలుచేశారు. అనంతరం న్యాయమూర్తులు., భక్తులు తక్కువగా ఉన్న సమయంలో పంచలింగం దర్శనానికి అనుమతించాలని, భక్తుల రద్దీ అధికంగా ఉంటే అనుమతి అక్కర్లేదని ఉత్తర్వులు జారీచేశారు. అదే సమయంలో, భక్తుల రద్దీని పరిగణలోకి తీసుకుని చర్యలు చేపడతామని ఆలయ నిర్వాహకుల హామీతో, కేసు విచారణ ముగిసినట్లు న్యాయమూర్తులు ఉత్తర్వులు జారీచేశారు.

అక్రమాస్తుల కేసులో దురైమురుగన్‌కు ఊరట

పెరంబూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో, మంత్రి దురైమురుగన్‌ను విడుదల చేయడాన్ని రద్దు చేస్తూ మద్రాసు హైకోర్టు వెలువరించిన ఉత్తర్వులకు సుప్రీంకోర్టు తాత్కాలిక స్టే విధించింది. 2006-11 వరకు అధికారంలో ఉన్న డీఎంకే ప్రభుత్వంలో దురైమురుగన్ ప్రజాపనుల శాఖ మంత్రిగా వ్యవహరించారు. ఆ సమయంలో ఆయన ఆదాయానికి మించి రూ.1.40 కోట్లు కూడబెట్టారంటూ ఏసీబీ అధికారులు 2011లో కేసు నమోదుచేశారు. మంత్రి దురైమురుగన్, ఆయన భార్య శాంతకుమారికి వ్యతిరేకంగా నమోదైన కేసు విచారించిన వేలూరు కోర్టు, వారిని విడుదల చేస్తూ 2017లో ఉత్తర్వులు జారీచేసింది. దీనిని వ్యతిరేకిస్తూ ఏసీబీ దాఖలుచేసిన అప్పీలు పిటిషన్ విచారించిన మద్రాసు హైకోర్టు వేలూరు కోర్టు ఉత్తర్వులు రద్దు చేసింది. హైకోర్టు ఉత్తర్వులు వ్యతిరేకిస్తూ దురైమురుగన్ సుప్రీంకోర్టులో అప్పీలు పిటిషన్ దాఖలుచేశారు. ఈ పిటిషన్ సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి దీబంగర్ దత్తా నేతృత్వంలోని ధర్మాసనం విచారించి, మద్రాసు హైకోర్టు ఉత్తర్వులపై తాత్కాలిక స్టే విధించారు. అలాగే, జిల్లా కోర్టులో కొనసాగుతున్న ఆదాయానికి మించి ఆస్తుల కేసు విచారణపై ధర్మాసనం మధ్యంతర స్టే విధించింది. ఈ విషయమై అఫిడవిట్ దాఖలుచేయాలని రాష్ట్ర అవినీతి నిరోధక శాఖకు ధర్మాసనం నోటీసు జారీచేసింది.

కుమార్తెపై అత్యాచారం కామాంధుడికి యావజ్జీవం

పెరంబూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కుమార్తెపై అత్యాచారానికి పాల్పడిన కామాంధుడికి కోర్టు యావజ్జీవ జైలు శిక్ష విధించింది. తంజావూరు జిల్లాకు చెందిన 49 ఏళ్ల వ్యక్తి, తన 16 ఏళ్ల కుమార్తెపై అత్యాచారం చేసినట్లు సమాచారం. ఈ విషయమై తంజావూరు ఇంటిగ్రేటెడ్ సేవా కేంద్రం నిర్వాహకులు నిత్య, పాపనాశం మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి కామాంధ తండ్రిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఈ కేసులో వాదనలు ముగిసి నేరారోపణ రుజువు కావడంతో, కామాంధుడైన తండ్రికి యావజ్జీవ జైలు శిక్ష, రూ.5,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించిన తంజావూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి తమిళరసి, బాధితురాలికి రూ.6 లక్షలు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశించింది.

'చెన్నై వన్' యాప్‌నకు స్పందన

పెరంబూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి: దేశంలోనే తొలిసారిగా రాజధాని నగరం చెన్నైలో అన్ని రకాల రవాణా సేవలను అనుసంధానిస్తూ ఒకే టిక్కెట్‌తో ప్రయాణం చేసేలా రూపొందించిన 'చెన్నై యాప్'కు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. సోమవారం ఈ యాప్‌ను సీఎం స్టాలిన్ ప్రారంభించగా ఇప్పటి వరకు 1,04,437 మంది యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ యాప్ వినియోగించి సోమవారం రోజున 4,395 మంది ప్రయాణించినట్లు అధికారులు తెలిపారు.

కరుణానిధి విగ్రహం ఏర్పాటుకు పిటిషన్.. తోసిపుచ్చిన సుప్రీం

పెరంబూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా వల్లియూరులో, దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి విగ్రహం ఏర్పాటుకు అనుమతి కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలుచేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. వల్లియూర్ కూరగాయల మార్కెట్ ప్రవేశ ద్వారంలో, కరుణానిధి కాంస్య విగ్రహం, శిలాఫలకం ఏర్పాటుచేయాలని వల్లియూర్ మున్సిపాలిటీ తీర్మానించింది. స్థానిక ఎమ్మెల్యే అభివృద్ధి నిధులతో, విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులను మున్సిపాలిటీ పొందింది. ఈ క్రమంలో, కరుణానిధి విగ్రహం ఏర్పాటును వ్యతిరేకిస్తూ పాల్‌స్వామి మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ విచారించిన హైకోర్టు, కరుణానిధి విగ్రహం ఏర్పాటుకు అనుమతి నిరాకరిస్తూ, బహిరంగ ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఏర్పాటుచేసిన ఇతర విగ్రహాలు కూడా తొలగించాలని ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులు వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అప్పీలు పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ న్యాయమూర్తి విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది విల్సన్ ఈ కేసు వాదించారు. ఈ కేసు విచారించిన ధర్మాసనం, రాష్ట్ర ప్రభుత్వ అప్పీలు పిటిషన్ తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీచేసింది. ఉత్తర్వుల్లో ఒక నాయకుడి కీర్తి చాటేలా విగ్రహాన్ని ఏర్పాటుచేయాలనే ప్రతిపాదన మద్రాసు హైకోర్టు తిరస్కరించిందని, ఎందుకంటే అది బహిరంగ ప్రదేశం కావడంతో ప్రజలకు ఇబ్బందిగా ఉంటుందని హైకోర్టు భావించిందని, కావున మేము ఈ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవాలని అనుకోవడం లేదని ధర్మాసనం పేర్కొంది.

400 ప్రాంతాల్లో వీధి శునకాలకు ఆహారం

పెరంబూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో వార్డుకు రెండు చొప్పున 400 ప్రాంతాల్లో వీధి శునకాలకు ఆహారం అందించనుంది. ఈ విషయమై జీసీసీ పశుసంవర్థక శాఖ అధికారులు మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా శునకాలు ప్రజలపై దాడి చేయడంతో రేబిస్ సోకి మృతిచెందుతున్న ఘటనలు పెరుగుతున్నాయన్నారు. ఈ క్రమంలో, వీధి శునకాలకు ఆహారం అందించేందుకు ప్రత్యేక స్థలాలు ఏర్పాటుచేయాలని ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశించిందని, ఆ ప్రకారం, జీసీసీ పరిధిలో 400 ప్రాంతాలు ఎంపిక చేయనున్నామన్నారు. అలాగే, ఆగ్రహంతో ఉండే శునకాలను గుర్తించి, వాటికి చికిత్సలందించేలా ప్రత్యేక స్థలం ఏర్పాటుచేయనున్నామని తెలిపారు. నగరంలో ఇప్పటివరకు 60వేల వీధి శునకాలకు టీకాలు వేసినట్లు, మిగిలిన వాటికి ఈ నెలాఖరులోపు వేయనున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాలు

పెరంబూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలో బుధవారం జరుగనున్న 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాల వివరాలను జీసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. 1వ మండలం 9వ వార్డు తిరువొత్తియూర్ తులకాత్తమ్మన్ ఆలయ వీధి (సీపీఎస్ స్కూల్ సమీపం), 3వ మండలం 23వ వార్డు వెస్ట్ కావంగరైలోని రాణిసంగుపాటి కల్యాణ మండపం, 5వ మండలం 57వ వార్డు షావుకారుపేట అన్నై పిళ్లై వీధిలోని చంద్రపురి ట్రస్ట్ మండపం, 6వ మండలం 78వ వార్డు సచ్చిదానందం వీధిలోని అరింజర్ అన్నా కమ్యూనిటీ హాలు, 7వ మండలం 89వ వార్డు మొగప్పైర్ మెయిన్ రోడ్డులోని చిన్నస్వామి కల్యాణ మండపం, 8వ మండలం 104వ వార్డు అన్నా నగర్, 1వ బ్లాక్ 28వ వీధిలోని కంబర్ అపార్ట్‌మెంట్స్ పిల్లల క్రీడా మైదానం, 9వ మండలం 117వ వార్డు టి.నగర్ గిరియప్ప వీధిలోని జీసీసీ కమ్యూనిటీ సెంటర్‌లో శిబిరాలు జరుగనున్నాయి. అలాగే, 10వ మండలం 132వ వార్డు కోడంబాక్కం డా.అంబేడ్కర్ రోడ్డు సమీపంలోని కమ్యూనిటీ సెంటర్, 11వ మండలం మధురవాయల్ వీహెచ్ రోడ్డులోని సీతాలక్ష్మి కల్యాణ మండపం, 14వ మండలం 183వ వార్డు పాలవాక్కంలోని వీజీపీ లే అవుట్ పార్క్, 15వ మండలం 198వ వార్డు షోలింగనల్లూర్ విలేజ్ హైరోడ్డులోని సెంబణి అమ్మన్ ఆలయ మండలం తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీసీసీ పిలుపునిచ్చింది.

నాణ్యత లేని 94 రకాల మందులు

పెరంబూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): షాపుల్లో విక్రయిస్తున్న మందుల్లో, 94 రకాల మందులు నాణ్యమైనవి కాదని పరిశోధనలో వెల్లడైందని కేంద్ర ప్రభుత్వ మందుల నాణ్యత నిర్ధారణ బోర్డు ప్రకటించింది. దేశంలో విక్రయిస్తున్న అన్ని రకాల మందులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మందుల నాణ్యత నిర్ధారణ బోర్డు పరిశీధిస్తోంది. గత నెల, వెయ్యికి పైగా మందుల శాంపిల్స్ సేకరించి పరిశోధించారు. వాటిలో జ్వరం, జలుబు, బాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు, జీర్ణవ్యవస్థ రుగ్మతలకు వినియోగించే 94 మందులు నాణ్యత లేనివిగా, మరో మూడు మందులు నకిలీవిగా గుర్తించారు. వాటి వివరాలు cdsco.gov.in అనే వెబ్‌సైట్‌లో విడుదల చేసినట్లు, ప్రజలు నాణ్యత లేని మందుల వివరాలు తెలుసుకుని అప్రమత్తంగా ఉండాలని బోర్డు సూచించింది.

జీఎస్టీ తగ్గింపు పట్టిక ఏర్పాటు చేయాలి

● కోవై వ్యాపారులకు ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ సూచన



వినియోగదారుల అభిప్రాయాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ప్యారీస్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): వస్తు సేవల పన్ను (జీఎస్టీ)తగ్గింపు పట్టికను తప్పనిసరిగా దుకాణాల్లో ఏర్పాటు చేయాలని కోవె ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ స్థానిక వ్యాపారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జీఎస్టీ తగ్గింపు మిగతా రాష్ట్రాల్లో లాగే రాష్ట్రంలో సోమవారం నుంచి అమలులోకి వచ్చింది. 99శాతం నిత్యావసర వస్తువుల ధరలు తగ్గడంపై వినియోగదారులు హర్షం తెలిపారు. జీఎస్టీ తగ్గింపుపై కోవై నియోజకవర్గంలో ఉన్న టీ దుకాణాలు, క్యాంటీన్లు, హోటళ్లు, కిరాణా సరుకులు విక్రయించే షాపుల్లో పన్ను తగ్గింపు పట్టిక ఏర్పాటు చేశారా? అని ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ మంగళవారం ఉదయం దుకాణాలకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వ్యాపారులు, కొనుగోలుదారుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. గాంధీపురంలో ఉన్న స్వీట్ దుకాణంలో ఆదివారం వరకు రూ.420లకు విక్రయించే కిలో మైసూరు పాక్ ప్రస్తుతం రూ.380కు, కిలో చిప్స్ రూ.640 నుండి రూ.540కు తగ్గడంపై హర్షవ్యక్తం చేసిన కొనుగోలుదారులు కేంద్రప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ, ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ 350కి పైగా వస్తువుల ధరలను తగ్గించిందన్నారు. రాష్ట్రప్రభుత్వం కూడా జీఎస్టీ తగ్గింపును పూర్తిస్థాయిలో అమలు జరిగేలా దృష్టిసారించాలన్నారు.

పచ్చబొట్టు ఉందంటూ నిరాకరణ...?

● సైన్యంలో చేరలేకపోయాననే బాధతో యువకుడి ఆత్మహత్య

పెరంబూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శరీరంపై పచ్చబొట్టు (టాటూ) ఉండడంతో సైన్యంలో చేరేందుకు నిరాకరించబడిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మదురై తత్తనేరి అరుళ్‌దాస్‌పురం ప్రాంతానికి చెందిన బాలమురుగన్ కుమారుడు యోగసుధీష్ మదురైలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతున్నాడు. సైన్యంలో చేరాలనే ఆశయంతో సుధీష్ శిక్షణ పొందాడు. ఇటీవల, ఈరోడ్‌లో జరిగిన సైనిక శిబిరానికి హాజరయ్యాడు. అతడి చేతిపై పచ్చబొట్టు ఉండడాన్ని గమనించిన అధికారులు, అతడిని ఎంపిక చేయకుండా పంపించేశారు. దీని కారణంగా కొద్దిరోజులుగా సుధీష్ ఆవేదన చెంది ఇంట్లో ఎవరూ లేని సయమంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై సెల్లూరు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

కోళ్లఫారం యజమాని ఇంట్లో ఐటీ దాడులు



ఐటీ దాడులు జరిగిన సుబ్రహ్మణ్యం నివాసం

చెన్నై, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నామక్కల్‌లోని కోళ్ల ఫారం యజమాని వి. సుబ్రమణ్యన్ నివాసంలో ఆదాయ పన్నుల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర కోళ్ల ఫారాల మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షుడు వి. సుబ్రమణ్యం నివాసం, ఆయన ఫైనాన్స్ సంస్థల కార్యాలయాలు తదితర ప్రాంతాల్లో ఐటీ అధికారులు సోదాలు జరిపారు. సుబ్రమణ్యం గత కొన్నేళ్లుగా భారీస్థాయిలో పన్నుల ఎగవేతకు పాల్పడ్డారనే ఆరోపణలపై విచారణలో భాగంగా ఈ దాడులు జరిపినట్లు ఐటీ అధికారులు పేర్కొన్నారు. ఇదే విధంగా నామక్కల్, ఈరోడ్, కాంగేయం, ఉడుమలై తదితర ప్రాంతాల్లోని కోళ్లఫారాలు, కోళ్ల దాణా తయారు చేసే సంస్థల్లోనూ దాడులు జరిపారు.

గ్రామ సభల్లో ఉపాధ్యాయులు పాల్గొనాలి

● పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు

పెరంబూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించే గ్రామ సభల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొనాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి జిల్లా ప్రధాన విద్యాశాఖాధికారి కార్యాలయాలకు ఉత్తర్వులు పంపారు. ప్రభుత్వ పాఠశాలల్లో బోధన, అభ్యాసం, పాఠశాల అభివృద్ధి, క్రమశిక్షణ, విద్యార్థుల భద్రతకు సంబంధించి పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్‌ఎంసీ) సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారని తెలిపింది. అక్టోబరు 2వ తేది గ్రామాల్లో జరిగే గ్రామ సభల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొని, ఎస్‌ఎంసీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ప్రజలకు వివరించాలన్నారు. దీని ద్వారా గ్రామాల్లోని పాఠశాలల సమస్యలు, అవసరాలు తెలుసుకుని తమ వంతుగా సహాయం అందించే అవకాశముందని పాఠశాల విద్య డైరెక్టరేట్ సర్క్యులర్‌లో తెలిపింది.

పాత కక్షలతో ఒకరిపై దాడి: ఇద్దరి అరెస్ట్

తిరుత్తణి, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యో తి): బియ్యం కొనుగోలు కోసం రైస్ మిల్‌కు వెళ్లిన ఓ వ్యక్తిపై పాతకక్షల కారణంతో దాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా... రాణిపేట జిల్లా నెమిలి సమీపంలోని కాట్టుపాక్కం గ్రామానికి చెందిన దేవరాజ్ (35) కాంచీపురంలోని ఓ పార్శిల్ కార్యాలయంలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం దేవరాజ్ తన యజమాని ప్రవీణ్‌కుమార్ సూచన మేరకు తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపం కేశవరాజుపేటలో ఉన్న రైస్‌మిల్లులో బియ్యం కొనుగోలు చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో రైస్‌మిల్లు యజమాని గోవిందరాజు, ఇళవరసన్‌లకు దేవరాజ్‌తో ఉన్న పాతకక్షల కారణంగా అతడిపై ఇనుప రాడ్లతో దాడికి పాల్పడ్డారు. దీంతో దేవరాజ్ రక్తపు మడుగులో స్పృహ కోల్పోయాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమివ్వగా పోలీసులు అక్కడికి చేరుకుని గాయపడిన దేవరాజ్‌ను ఆస్పత్రికి తరలించి, నిందితులను అరెస్ట్ చేశారు.

మురికినీటిలో దిగి కార్పొరేటర్ నిరసన



ప్యారీస్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లాలోని కారైక్కుడి కార్పొరేషన్ పనితీరుకు నిర సనగా అన్నా డీఎంకే కార్పొరేటర్ ప్రకాష్ మురికినీటిలో దిగి నిరసన తెలిపారు. వందకు పైగా కుటుంబాలు నివసిస్తున్న 21వ వార్డులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉన్నందున వర్షాకాలంలో మురికినీరు నిలిచి దుర్గంధం వ్యాపిస్తుందని, కౌన్సిల్ సమావేశంలో పలుమార్లు కార్పొరేటర్ ప్రకాష్ ప్రస్తావించినా.. ఫలితం కనిపించలేదని తెలిసింది. ఇదే సమస్యపై ఈ నెల 15న వార్డు ప్రజలతో కలిసి వెళ్లి మేయర్‌కు వినతిపత్రం సమర్పించినా సంబంధిత అధికారులు పట్టించుకోలేని సమాచారం. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం కార్పొరేటర్ ప్రకాష్ మురికినీటిలో దిగి కార్పొరేషన్ వైఖరిని ఖండిస్తూ వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తున్న కార్పొరేషన్ వారికి కనీస వసతులు కల్పించడంలేదని, నిర్లక్ష్యం చూపుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

చెన్నై, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలైలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతిచెందారు. వివరాలిలా వున్నాయి... మేల్‌పుళిదియూర్ గ్రామానికి చెందిన సతీష్ (20)తన స్నేహితులు పుగళ్ (19), రాఘవన్ (13)తో కలసి ఒకే బైక్‌పై సోమవారం సాయంత్రం మేల్‌సెంగం వైపు బయల్దేరారు. ఆ ప్రాంతంలోని బస్టాండ్ సమీపంలో వస్తున్న బైక్, కోవై నుంచి సెయ్యారు వైపు వెళ్తున్న అరుణ్‌కుమార్ (22) బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో సతీష్, పుగళ్, అరుణ్‌కుమార్‌లకు తీవ్ర గాయాలు కాగా, రాఘవన్‌కు స్వల్పంగా గాయపడ్డాడు. చుట్టుపక్కల వారు వారిని సెంగం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స ఫలించక పుగళ్, అరుణ్‌కుమార్ మృతిచెందారు. సతీష్‌ను మెరుగైన చికిత్స కోసం తిరువణ్ణామలై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సెంగం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

విజయ్‌కు క్రేన్ ద్వారా గజమాల సత్కార వ్యవహారం... పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన ముగ్గురు


ప్యారీస్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): తిరువారూర్‌లో శనివారం నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్న తమిళగ వెట్రి కళగం (టీవీకే)అధ్యక్షుడు విజయ్‌ను ఆహ్వానిస్తూ క్రేన్ ద్వారా గజమాలతో సత్కరించిన వ్యవహారంలో పోలీసులు నలుగురిపై కేసు నమోదు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా వ్యవహరించిన టీవీకే నిర్వాహకులు, ఎక్సకవేటర్ యజమానిని అరెస్ట్ చేసేందుకు పోలీసులు గాలించిన నేపథ్యంలో, టీవీకేకు చెందిన ఆ ముగ్గురు మంగళవారం తిరువారూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయారు.

లిఫ్ట్‌లో చిక్కుకుని మెకానిక్ మృతి

చెన్నై, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపేటలోని ఓ వాణిజ్య కాంప్లెక్స్‌లో ప్రొజెక్టర్ శుభ్రం చేస్తున్న సమయంలో, లిఫ్ట్ ఆటోమేటిక్‌గా పనిచేసి, తలకు తీవ్రగాయమై మెకానిక్ మృతిచెందిన ఘటన కలకలం రేపింది. ఈ కాంప్లెక్స్‌లో ఉన్న థియేటర్‌లో హైడ్రాలిక్ లిఫ్ట్ మరమ్మతులకు గురైంది. మంగళవారం ఉదయం పెరంబూర్‌కు చెందిన మెకానిక్ రాజేష్ (34) లిఫ్ట్‌పై భాగంలో నిలబడి మరమ్మతులు చేస్తున్న సమయంలో, లిఫ్ట్ ఆటోమేటిక్‌గా పైకి వెళ్లింది. భవనం పై అంతస్తు గోడకు తగలడంతో రాజేష్ తలకు బలమైన గాయాలయ్యాయి. అక్కడే ఉన్న వారు అతడిని రక్షించి రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై అన్నాసాలై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఓట్టేరి వద్ద ఐదు కిలోల గంజాయి స్వాధీనం

చెన్నై, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఓట్టేరిలో ఐదు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు, ఓ యువకుడిని అరెస్ట్ చేశారు. ఓట్టేరి ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నట్లు ఓట్టేరి సీఐ రమేష్‌కు సమాచారం అందింది. పనతోపు రైల్వే కాలనీలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకుని అతడి బ్యాగు తనిఖీ చేసి, 5 కిలోల గంజాయి, తూనిక, ప్యాకింగ్ చేసే వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో... కొడుంగైయూర్ తెన్రల్ నగర్‌కు చెందిన విష్ణు (22) అని, పొరుగు రాష్ట్రాల నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయిస్తుంటాడని తెలిసింది. అతడిని కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



'సర్దార్-2' విడుదల వాయిదా?

దర్శకుడు పీఎస్ మిత్రన్ - హీరో కార్తి కాంబినేషన్‌లో రూపొందుతున్న 'సర్దార్-2' మూవీ విడుదల వాయిదా పడినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. 2022లో వచ్చిన ఈ చిత్రం తొలి భాగం సూపర్ హిట్‌గా నిలిచింది. దీంతో మూవీ రెండో భాగం నిర్మాణ దశలో ఉంది. ఇందులో ఎస్‌జే సూర్య, మాళవికా మోహనన్, ఆషికా రంగనాథ్, రజీషా విజయన్, యోగిబాబు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. చెన్నై, మైసూర్, బ్యాంకాగ్ తదితర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుకుంది. అయితే, ఈ సినిమా డిజిటల్ బిజినెస్ ఇంకా పూర్తి కాకపోవడంతో ఈ సినిమా విడుదల వాయిదా వేయాలని మేకర్స్ నిర్ణయించినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఇదిలావుంటే, కార్తి హీరోగా నటించిన 'వా వాత్తియార్' మూవీ మాత్రం ఈ యేడాది డిసెంబరులో విడుదలకానుంది.

రాక్షసుడిగా ఎస్‌జే సూర్య

తమిళ చిత్రపరిశ్రమలో విలక్షణ నటుడు, దర్శకుడిగా గుర్తింపు పొందిన ఎస్‌జే సూర్య రాక్షసుడి పాత్రలో కనిపించనున్నారు. 'హనుమాన్' వంటి సూపర్ హీరో చిత్రాన్ని రూపొందించిన ప్రశాంత్ వర్మ ఆ తరువాత 'ఆధిరా' పేరుతో ఓ సినిమా నిర్మాణం చేపట్టారు. ఇందులో ఎస్‌జే సూర్య రాక్షసుడు (అసురన్)గా నటిస్తున్నారు. మరో ప్రధాన పాత్రలో కళ్యాణ్ దాసరి కనిపించనున్నారు. ఆర్‌కే దుగ్గల్ సమర్పణలో ఆర్‌కేడీ స్టూడియోస్ పతాకంపై రూపుదిద్దుకునే ఈ చిత్రానికి చరణ్ కొప్పిశెట్టి దర్శకుడు. ప్రశాంత్ వర్మ, రిజ్వాన్ రమేష్ దుగ్గల్ నిర్మాతలు. పురాణాల్లోని కొన్ని ముఖ్య పాత్రలు తీసుకుని వాటికి అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి సూపర్ హీరో మూవీలుగా రూపొందిస్తున్నారు. ఆ కోవలోనే ఈ చిత్రాన్ని కూడా నిర్మిస్తున్నారు. ఈ యేడాది ఆఖరులో విడుదల చేసేలా ప్లాన్ చేసినట్టు దర్శక నిర్మాతలు వెల్లడించారు.



హీరో సూర్యకు తల్లిగా రాధిక



అగ్ర నటుడు సూర్య నటించే తాజా చిత్రంలో సీనియర్ నటి రాధిక తల్లి పాత్రలో కనిపించనున్నారు. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో సూర్య 'రెట్రో' మూవీలో నటించారు. ఈ చిత్రం తర్వాత ఆర్‌జే బాలాజీ దర్శకత్వంలో 'కరుప్పు'లో నటిస్తున్నారు. దీని తర్వాత టాలీవుడ్ దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్య ఓ చిత్రంలో నటించనున్నారు. ఇది సూర్య నటించే 46వ చిత్రం. ఇందులో హీరోయిన్‌గా మమిత బైజును ఎంపిక చేయగా, బాలీవుడ్ నటి రవీనా టాండన్ ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. గత రెండు నెలలుగా హైదరాబాద్ నగరంలో చిత్రీకరణ జరుగుతోంది.. ఇందులో నటి రాధిక... హీరో సూర్యకు తల్లిగా నటిస్తుండగా, వీరిద్దరి మధ్య సాగే సెంటిమెంట్ సన్నివేశాలను ఇటీవల చిత్రీకరించారు.

చిత్రజ్యోతి

కోలీవుడ్‌లో రీ-రిలీజ్‌ల జోరు


'ఖుషి'లో విజయ్ - జ్యోతిక

ఇటీవలి కాలంలో తమిళంలో రీ రిలీజ్ చేసే పాత సినిమాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అగ్రహీరో విజయ్ నటించిన 'గిల్లీ' మూవీ రెండోసారి విడుదల చేయగా, కలెక్షన్ల వర్షం కురిపించింది. ముఖ్యంగా మూడు వారాలకు పైగా ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. దీంతో పలువురు అగ్రహీరోలు నటించిన సూపర్ హిట్ చిత్రాలను రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ కోవలో ఈ నెల 25, శుక్రవారం మరో మూడు పాత చిత్రాలు విడుదలకానున్నాయి. ఇందులో ఎస్‌జే సూర్య దర్శకత్వంలో నిర్మాత ఏఎం రత్నం నిర్మించిన 'ఖుషి' ఒకటి. అలాగే, లింగుస్వామి దర్శకత్వంలో ఆర్.మాధవన్ నటించిన 'రన్' మూవీ కూడా రిలీజ్ చేస్తున్నారు. కాగా బడా నిర్మాత కలైపులి ఎస్.థాను 'సచిన్' చిత్రాన్ని రీ రిలీజ్ చేయగా, ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. దీంతో అజిత్ హీరోగా నటించిన 'కండుకొండేన్ కండుకొండేన్' చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నారు. ఇదిలావుండగా ఏ.ఎం.రత్నం నిర్మించిన 'ఇండియన్', 'బాయ్స్', 'ధూల్', 'దిల్', 'ఎనక్కు 20 ఉనక్కు 18' వంటి హిట్ చిత్రాను ఆయన రీ రిలీజ్ చేయాలన్న ఆలోచనలో ఉన్నారు. అదేవిధంగా విజయకాంత్ నటించిన 'కెప్టెన్ ప్రభాకరన్' మూవీ రీరిలీజ్ చేయగా ప్రేక్షకు ఆదరించారు. దీంతో ఆయన నటించిన అనేక హిట్ చిత్రాలను మళ్ళీ రిలీజ్ చేయాలన్న ఆలోచనలో ఉన్నారు.


'రన్'లో మాధవన్ - మీరా జాస్మిన్

రోటరీ ఆధ్వర్యంలో మహిళలకు పింక్ ఆటోల పంపిణీ


మహిళలకు పింక్ ఆటోలను పంపిణీ చేస్తున్న రోటరీ నిర్వాహకులు

చెన్నై, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రోటరీ డిస్ట్రిక్ట్ 3234 ఆధ్వర్యంలో వంద మంది నిరుపేద మహిళలకు పింక్ ఆటోలను ఆ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఏకేఎస్ రోటేరియన్ వినోద్ సరోగి పంపిణీ చేశారు. ఏఎం జైన్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఈ పింక్ ఆటోల తాళాలను మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా వినోద్ సరోగి మాట్లాడుతూ మహిళల జీవితాల్లో వెలుగులు నింపేందుకు, వారిలో స్వయం సంపాదన పెంచేందుకు ఈ పింక్ ఆటోల స్కీమ్ రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పింక్ ఆటో స్కీమ్ చైర్మన్ రోటేరియన్ శివా ఇలంగోవన్ తదితరులు పాల్గొన్నారు.

'సికా' ఒలింపియాడ్ అవార్డుల ప్రదానోత్సవం


అవార్డుల ప్రదానోత్సవంలో ప్రముఖులు

అడయార్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'సౌత్ ఇండియా చెఫ్స్ అసోసియేష్' (సికా) ఆధ్వర్యంలో కలినరీ ఒలింపియాడ్, ఫుడ్ కాంపిటీషన్ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. సోమవారం రాత్రి చెన్నైలో జరిగిన ఈ వేడుకల్లో ఉత్తమ హోటళ్లకు 'చెఫ్ సౌందరరాజన్ మెమోరియల్ కప్' ప్రదానం చేశారు. ఇందులో భాగంగా మొదటి ఉత్తమ హోటల్‌గా 'ది రెసిడెన్సీ టవర్స్', రెండో స్థానంలో రాడిసన్ బ్లూ గ్రాంట్, తృతీయ స్థానంలో గ్రాండ్ బై జీఆర్టీ నిలిచాయి. అదేవిధంగా ఉత్తమ పీఆర్వోలుగా ఇంద్రన్, డీఆర్ విజయలక్ష్మిలను సత్కరించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా సుదీప్తో చక్రవర్తి, పద్మసింగ్ ఐజాక్, టి.సతీష్‌కుమార్, పద్మశ్రీ డాక్టర్ చెఫ్ దామోదరన్ తదితరులు హాజరయ్యారు.


పీసీసీ ఆధ్వర్యంలో 'రోజ్ డే'



క్యాన్సర్ విజేతలకు కిట్ల ప్రదానం

అడయార్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేస్తున్న చారిటబుల్ ట్రస్ట్ క్యాన్సర్ అల్లెవియేషన్ ఫౌండేషన్ సహకారంతో ప్యాటర్సన్ క్యాన్సర్ సెంటర్ (పీసీసీ) ఆధ్వర్యంలో మంగళవారం 'రోజ్ డే' వేడుకలు జరిగాయి. ఇది క్యాన్సర్ రగులకు ఆశ, ఉత్సాహం, మద్దతు తీసుకువచ్చేందుకు రూపొందించిన వేడుకగా నిర్వాహకులు పేర్కొన్నారు. క్యాన్సర్‌తో విజయవంతంగా పోరాడి విజేతలైన క్యాన్సర్ అంబాసిడర్లు ఈ కార్యక్రమంలో పాల్గొనడం విశేషం. ఈ కార్యక్రమంలో పీసీసీ ఎండీ డాక్టర్ ఎస్.విజయరాఘవన్ పాల్గొని రోగులందరికీ అవసరమైన రోజువారీ వస్తువుల యుటిలిటీ కిట్లను పంపిణీ చేశారు. మనిదనేయం ట్రస్టు వ్యవస్థాపక చైర్మన్ సైదై ఎస్ఏ దురైస్వామి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

తేనాంపేట అపోలో హాస్పిటల్‌లో పల్మనాలజీ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభం



పల్మనాలజీ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభిస్తున్న సీఈఓ కరణ్‌పూరి

చెన్నై, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక తేనాంపేటలోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్‌లో మంగళవారం శ్వాసకోశ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పల్మనాలజీని ప్రారంభించారు. ఉబ్బసం, దీర్ఘకాలిక ఊపిరి తిత్తుల వ్యాధులు, పొగాకు వాడకం వల్ల కలిగే సమస్యలను పరిష్కరించేందుకు, అదే విధంగా నగరంలో వాయు కాలుష్యం కారణంగా బాధపడేవారికి ఈ కేంద్రం ద్వారా చికిత్స లభిస్తుందని ఆస్పత్రి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కరణ్‌పూరి తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ పల్మనాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ రాజగోపాల తదితరులు పాల్గొన్నారు.


చెన్నై మైలాపూరు శ్రీరామకృష్ణ మిషన్ స్టూడెంట్స్ హోమ్‌లో మంగళవారం నవరాత్రి వేడుకల ప్రారంభోత్సవం సందర్భంగా జ్యోతిప్రజ్వలన చేసి బొమ్మల కొలువును ప్రారంభిస్తున్న శ్రీరామకృష్ణమఠం అధ్యక్షులు స్వామి సత్య జ్ఞానానంద



పురస్కారాలు అందుకుంటున్న సంతానం, సి.తంగరాజు

రెప్కో బ్యాంకుకు రెండు పురస్కారాలు

చెన్నై, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గోవాలో జరిగిన జాతీయ సహకార బ్యాంకింగ్ సమ్మిట్‌లో అత్యుత్తమ పని తీరు కనబరిచినందుకు 'ఫ్రాంటియర్స్ ఇన్ కో-ఆపరేటివ్ బ్యాంకింగ్ అవార్డ్స్' నుంచి రెప్కో బ్యాంకు రెండు అవార్డులు అందుకుంది. ఈ పురస్కారాలను రెప్కో బ్యాంక్ చైర్మన్ ఇ.సంతానం, రెప్కో హోం ఫైనాన్స్ లిమిటెడ్ చైర్మన్ సి.తంగరాజు, మేనేజింగ్ డైరెక్టర్ ఓఎం గోకుల్, జనరల్ మేనేజర్ బి.కన్నన్ అందుకున్నారు. ఈ సందర్భంగా సంతానం మాట్లాడుతూ.. శ్రీలంక, బర్మా నుంచి తిరిగి వచ్చిన వారి పునరావాసం కోసం భారత ప్రభుత్వం 1969లో రెప్కో బ్యాంకు స్థాపించిందని, దేశంలోని దక్షిణ ప్రాంతాల్లో ప్రముఖంగా వున్న ఈబ్యాంకు భారతదేశంలోని సహకార బ్యాంకుల్లో ఒకటిగా రూపాంతరం చెందిందని తెలిపారు. 108 శాఖలతో రూ.22,500 కోట్లకు పైగా వ్యాపార మిత్రమంతో నడుస్తోందని వివరించారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిపాలనా నియంత్రణలో వున్న ఈ బ్యాంకు 30ఏళ్లుగా నిరంతరలాభాలతో 2024-25 ఆర్థిక సంవత్సరంలోని దానివాటాదారులకు 30 శాతండివిడెండ్ ప్రకటించిందని గుర్తుచేశారు.

గాయత్రి అలంకారంలో వాసవాంబ



తిరుత్తణి, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులో ఉన్న కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం శరన్నవరాత్రుల సందర్భంగా మంగళవారం అమ్మవారు గాయత్రిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం సాయంత్రం అర్చకులు అమ్మవారికి గాయత్రి అలంకారం నిర్వహించి పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు జయకృష్ణన్, ఆలయ నిర్వాహకులు అనిల్‌కుమార్, శ్రావణ్, నాగేంద్రశెట్టి, శేషు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ చెన్నై 'ఐకాన్ ఆఫ్ ది మంత్'గా విశ్వనాథన్ ఆనంద్


ఆనంద్‌కు పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

చెన్నై, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే మొట్టమొదటి పౌరులు నడిపే నగర బ్రాండింగ్ ఉద్యమమైన 'సూపర్ చెన్నై' గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్‌ను సెప్టెంబరు-2025 'ఐకాన్ ఆఫ్ ది మంత్'గా ప్రకటించింది. ఈ మేరకు సూపర్ చెన్నై మేనేజింగ్ డైరెక్టర్ రంజిత్ రాథోడ్ మంగళవారం చెన్నైలో విశ్వనాథన్ ఆనంద్‌కు పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ ఆనంద్ మాట్లాడుతూ.. సూపర్ చెన్నై ఐకాన్ ఆఫ్ ది మంత్‌గా ఎంపికవడం సంతోషంగా వుందన్నారు. చెస్‌కు చెన్నై ఎప్పుడూ ఎనలేని గుర్తింపు ఇస్తుందన్నారు. చెన్నై వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడంలో తాను చిన్న పాత్ర పోషించగలిగినా సంతోషమేనన్నారు. రంజిత్ రాథోడ్ మాట్లాడుతూ.. విశ్వనాథన్ ఆనంద్‌ను గౌరవించడం ద్వారా మన నగర మేధో బలాన్ని ప్రపంచానికి మరింత చాటి చెప్పినట్లయిందన్నారు. ఇదిలా వుండగా సూపర్ చెన్నై నిర్వహిస్తున్న ఐకాన్ ఆఫ్ ది మంత్ పురస్కారానికి గతంలో నేచురల్స్ సెలూన్ సహ వ్యవస్థాపకులు సీకే కుమార్‌వేల్, కావేరీ హాస్పిటల్స్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్.చంద్రకుమార్ ఎంపికైన విషయం తెలిసిందే.


కోయంబేడు మార్కెట్ మేనేజ్‌మెంట్ కమిటీ ఆన్‌లైన్ సేవలను ప్రారంభిస్తున్న మంత్రి శేఖర్‌బాబు

25 నుంచి కోయంబేడులో ఆయుధపూజ సంత

- మంత్రి, సీఎండీఏ చైర్మన్ పీకే.శేఖర్‌బాబు

ప్యారీస్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు హోల్‌సేల్ మార్కెట్ ప్రాంగణంలో ఈనెల 25 నుండి అక్టోబర్ 5వ తేదీ వరకు ఆయుధపూజ ప్రత్యేక సంత పని చేస్తుందని రాష్ట్ర మంత్రి, చెన్నై మెట్రోపాలిటన్ అథారిటీ (సీఎండీఏ) చైర్మన్ పీకే.శేఖర్‌బాబు తెలిపారు. కోయంబేడు మార్కెట్ మేనేజ్‌మెంట్ కమిటీ కొత్తగా రూపొందించిన ఆన్‌లైన్ సేవలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వంలోని పలు శాఖల పనులను వేగవంతం చేయడానికి అనుకూలంగా డిజిటలైజేషన్ ప్రక్రియ జరుగుతోందన్నారు. ఇందులో భాగంగానే ప్రస్తుతం కోయంబేడు మార్కెట్ మేనేజ్‌మెంట్ కమిటీ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఆయుధపూజను జరుపుకోనున్న ప్రజల సౌకర్యార్థం ఈ నెల 25న కోయంబేడు మార్కెట్‌లో ప్రత్యేక సంత ప్రారంభిస్తామని, ఇది అక్టోబర్ 5వ తేదీ వరకు పనిచేస్తుందన్నారు. సీఎండీఏ 3వ మెగా ప్రణాళిక పథకాన్ని వచ్చే ఏడాది జనవరిలో ముఖ్యమంత్రి స్టాలిన్ విడుదల చేస్తారన్నారు. కోయంబేడు సంతను అభివృద్ధిపరిచేలా వాననీటి సంరక్షణ కాలువ, తాగునీరు, మరుగుదొడ్ల వసతిని అదనంగా కల్పించే చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు.

లక్ష్మీదేవిగా కన్యకా పరమేశ్వరి

ప్యారీస్, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ)లో శరన్నవరాత్రి ఉత్సవాల్లో రెండో రోజైన మంగళవారం లక్ష్మీ అలంకారంలో సూర్యప్రభ వాహనంపై కన్యకా పరమేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 7.30 గంటలకు వేదపారాయణం, 9 గంటలకు కన్యకా పరమేశ్వరి మూలమంత్ర హోమం, 10.30 గంటలకు అభిషేకం, సాయంత్రం 6.30 గంటలకు లక్ష్మీ అలంకారం, దీపారాధన నిర్వహించారు. జ్ఞానప్రియ బృందం భక్తిపాటలతో, సీపీ సాంబవిక భరతనాట్యంతో అలరించారు. కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల విద్యార్థినులు భక్తిపాటలు, పుష్పాంజలి, తమిళ, తెలుగు జానపద నృత్యాలు ప్రదర్శించి సందడి చేశారు. చివరగా భక్తులందరికి ఎస్‌కేపీడీ ట్రస్టీలు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.


సూర్యప్రభ వాహనంపై లక్ష్మీదేవిగా కన్యకా పరమేశ్వరి అమ్మవారు

రెండు ఇడ్లీలు చాలంటే మూడో ఇడ్లీ నోటిలో కుక్కడం భావ్యమా?

- 'త్రిభాషా విధానం'పై విద్యా శాఖ మంత్రి అన్బిల్ మహేష్ ఆగ్రహం


దిండుగల్ పాఠశాలలో విద్యాశాఖ తరపున సహాయాలుఅందజేస్తున్న మంత్రి అన్బిల్ మహేష్

చెన్నై, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్రిభాషా విద్యావిధానాన్ని అమలు చేసి తీరాల్సిందేనని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పట్టుబట్టడం విడ్డూరంగా ఉందని.. ఈ వ్యవహారం రెండు ఇడ్లీలు చాలని చెప్పే బాలుడి నోట్లో మూడో ఇడ్లీ కుక్కినట్లుందని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ యెద్దేవా చేశారు. దిండుగల్‌లోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు సహాయాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్ని రాష్ట్రాలు త్రిభాషా విద్యావిధానాన్ని అమలు చేస్తుంటే రాష్ట్రం వ్యతిరేకిస్తోందని ఆరోపించడం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ ప్రకారమే ద్విభాషా విద్యావిధానాన్ని అమలు చేస్తున్నామని, త్రిభాషా విద్యావిధానానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తే కేంద్రం దొడ్డిదారిన నిర్బంధంగా హిందీ అమలు చేస్తుందనే విషయం తమకు తెలుసని వ్యాఖ్యానించారు. కేంద్రం విద్యార్థుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తోందనటానికి విద్యానిధులను నిలిపివేయడమే సాక్ష్యమన్నారు. ఇకనైనా కేంద్రం నిలిపివేసిన విద్యానిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.


వడపళని మురుగన్ ఆలయంలో నవరాత్రి సందర్భంగా ఏర్పాటైన బొమ్మల కొలువులో శ్రీరాజేశ్వరి అమ్మవారు


వడపళని ఆలయంలో మెగా బొమ్మల కొలువును ఆసక్తిగా తిలకిస్తున్న బాలబాలికలు

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడిగా తిరుమల శ్రీవేంకటేశ్వరుడిని భక్తజనం కొలుస్తారు. దేశం నలుమూలల నుంచీ తండోపతండాలుగా తరలివస్తారు. స్వామి వైభవాన్ని చూసి తరిస్తారు. వెయ్యేళ్లుగా తిరుమల ఆలయంలో కొనసాగుతున్న పూజా కైంకర్యాలు, స్వామికి అలంకరించే ఆభరణాలు, అనుసరిస్తున్న ఆచార సంప్రదాయాలు.. వెనుక ఆయన భక్తాగ్రేసరులు ఎందరో ఉన్నారు. చక్రవర్తుల మొదలు సామాన్యుల దాకా ఆయన సేవలో తరించి అనుగ్రహం అందుకున్నారు.. అందులో కొందరి గురించి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్మరించుకుందాం..



సేవింతురే!



చిత్రం: పి.రమేష్, శ్రీకాళహస్తి

శ్రీవారి సర్వసేనాని

తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠప్రదక్షిణ ద్వారానికి పక్కన చిన్న మందిరంలో దక్షిణాభిముఖంగా విష్వక్సేనుడి శిలాప్రతిమ ఉంటుంది. ఆణివార ఆస్థానంలోను, ఉగాది, దీపావళి ఆస్థానాల్లోను, బ్రహ్మోత్సవాల్లోను, విశేష తిరువీధి ఉత్సవాల్లోను పంచ ఆయుధాలు ధరించిన పంచలోహ విష్వక్సేనుడు మాడవీధుల్లో ఊరిగి ఏర్పాట్లను పర్యవేక్షిస్తాడు. శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రధాన సైన్యాధిపతి ఈయన. విష్వక్సేనుడు అంటే అంతటా వ్యాపించిన సేన కలవాడు అని అర్థం. 'విష్వక్సేనో జనార్దనః' అని అమరం పేర్కొంటుంది. విష్వక్సేనుడు అనే పేరు విష్ణుదేవుని సేనాపతికీ ఉంది. విష్ణుదేవుడే తన సైన్యాల కోసం తానే సేనాపతిగా అవతరించి విష్వక్సేనుడు అయ్యాడు అంటారు. కాకపోతే వేరొకరు జగన్నాయకుని సేనలకు ఆధిపత్యం వహించగలరా? మంగళవారం అంకురార్పణ రోజున ఆయన మాడవీధుల పర్యవేక్షణ తర్వాతే బ్రహ్మోత్సవ సంరంభం ఆరంభం అయ్యింది.



సిద్ధమైన సైకత శిల్పం

అలాగే ఈసారి 'వైకుంఠంలోని విమాన వేంకటేశ్వరస్వామి గోపురాన్ని తిరుమలకు తెస్తున్న గరుడుడు' అనే అంశంపై సాండ్ ఆర్ట్‌ను కూడా సిద్ధం చేశారు.

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 21 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.06 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 60,681

తలనీలాలు సమర్పించినవారు: 19,510



భగవద్బంధువులు శ్రీవారి సేవకులు

చైర్మన్ బీఆర్ నాయుడు



తిరుమల, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తులకు సేవలు అందిస్తున్న శ్రీవారిసేవకులు భగవద్బంధువులు అని టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు సేవలందించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన శ్రీవారిసేవకులతో తిరుమలలోని అస్థానమండపంలో మంగళవారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 'తిరుమలకు వచ్చే భక్తుల్లోనే భగవంతుడు ఉన్నాడు. వారికి సేవ చేస్తే భగవంతుడికి సేవ చేసినట్లే' అన్నారు. దేశంలోని ఎంతోమంది ప్రముఖులు శ్రీవారి సేవ చేసేందుకు ఉత్సాహం చూపిస్తున్నారన్నారు. శ్రీవారిసేవకులకు ప్రస్తుతం కల్పిస్తున్న సాధారణ దర్శనం స్థానంలో స్వామిని మరింత దగ్గరగా దర్శించుకునేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను అధికారులను కోరారు. దీనిపై బోర్డులో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్, సీవీఎస్వో మురళీకృష్ణ, డీఎఫ్‌వో ఫణికుమార్ నాయుడు, సీపీఆర్వో రవి, ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.




90 వేల మొక్కలతో పుష్పప్రదర్శన శాల

తిరుమలలోని కల్యాణవేదిక వద్ద ఎప్పటిలానే ఫల పుష్ప ప్రదర్శన శాల సిద్ధమైంది. దాదాపు 90 వేల మొక్కలను ఈసారి ప్రదర్శనలో ఉంచారు. ఇందులో 18 రకాల పుష్పమొక్కలను వివిధ రంగుల్లో ఒకేచోట చూసే అవకాశం భక్తులకు లభించనుంది. ఇక, పండ్లు, కూరగాయలతో పక్షులు, జంతువులను ఏర్పాటు చేశారు. శ్రీరాముడిపైనే యుద్ధానికి సిద్ధపడిన హనుమంతుడు, భీముడు-బకాసురుడి యుద్ధం, శ్రీరాముడు ద్వితీయ వివాహం చేసుకున్నాడనే సీతమ్మ అనుమానాన్ని నివృత్తి చేస్తున్న వాల్మీకి మహర్షి, ఇంద్రుడితో యుద్ధం చేస్తున్న శ్రీకృష్ణార్జునులు, లంకిణి అనే రాక్షసి నోట్లోకి ప్రవేశిస్తున్న అంజనేయుడు, లంకాదహనం, విష్ణువుకు పవళింపుసేవ చేస్తున్న అంజనేయుడు, ఘటోత్కజుడు, చిన్నకృష్ణుని లీలలు, శ్రీకృష్ణుణి తులాభారం, అహంకార భక్తికంటే ఆత్మశుద్ధితో పూజించేవారికే తాను విధేయుడని నిరూపిస్తున్న స్వామి.. ఇలా పురాణాల్లోని దాదాపు 14 ఘట్టాలను కళ్లకు కట్టినట్టు చూపే సెట్టింగులు వేశారు. ఈ ప్రదర్శనశాల గురువారం నుంచి భక్తులకు అందుబాటులోకి రానుంది.

\- తిరుమల, ఆంధ్రజ్యోతి







అంగరంగ వైభవంగా జరిగే శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలకు సకల దేవతలనూ ఆహ్వానిస్తూ ఆలయంలో ఎగరేసేదే ధ్వజపటం. ఆహ్వానం పలికేవాడు గరుడుడు. కొడితాడు సాయంతో ధ్వజస్తంభం శిఖరానికి చేర్చి ఎగరేసే కార్యక్రమమే ధ్వజారోహణం. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిది రోజులూ రెపరెపలాడే ధ్వజపటం నుంచి గరుడుడు వేడుకలను వీక్షిస్తుంటాడు. పసుపువర్ణంతో ఎగిరే ఈ పతాకం మీద రెక్కలు విప్పుకుంటూ ఒక కాలు నేలకు ఆన్చి మరో కాలు గాల్లోకి లేస్తున్నట్టుగా గరుడుడి చిత్రం ఉంటుంది. తొమ్మిది అడుగుల ధ్వజపటాన్ని 40 ఏళ్లుగా రూపొందించే అరుదైన అవకాశం తిరుపతి చిత్రకారుడికి దక్కింది. ఆయనపేరు శ్రీవశ్రీ. పూర్తి పేరు పేరూరు శివప్రసాద్. టీటీడీ చిత్రకారుడిగా సుప్రసిద్ధుడు. 40వ ధ్వజపటచిత్రాన్ని సోమవారం నాడు తిరుమల ఆలయంలో స్వామి పాదాల ముందుంచి అధికారులకు అప్పగించిన శివశ్రీ ఆంధ్రజ్యోతితో పంచుకున్న విశేషాలు...


\- ఆంధ్రజ్యోతి - తిరుపతి

శ్రీవారికి

శివశ్రీ చిత్రకైంకర్యం

40 ఏళ్లుగా ధ్వజపటం సమర్పిస్తున్న చిత్రకారుడు

> ధ్వజపటం వేయడం అన్నది చిత్రకళకు మాత్రమే పరిమితమైనది కాదు. అదొక దివ్యానుభూతి. స్వామితో ఏర్పడిన ఆత్మిక బంధం. ఈ పనికి ఆయన నన్ను ఎంచుకున్నాడు. నా ప్రయత్నం మాత్రమే అయితే 40 ఏళ్లు నిర్విఘ్నంగా సాగేదేనా?!



నిష్ఠతో మూడు రోజులు

గరుడపటం కోసం మూడుకి 9 అడుగుల నిడివి ఉండే తెల్లని మెత్తని వస్త్రంను ఎంచుకుంటాం. పసుపులో ఒక రోజంతా ఆ గుడ్డను నానబెట్టాలి. ఆ తర్వాత నిమ్మ ఉప్పులో ఒక గంట ఉంచాలి. ఆరిన తర్వాత చిత్రరచన మొదలవుతుంది. నా శ్రీమతి పసుపు అద్దకం పూర్తయ్యాక ఒక గదిలో మూడు రోజులు నిష్ఠతో నేను మాత్రమే చేసే కార్యం ఇది. బొగ్గు, ఎర్రమట్టి, నామం కొమ్ము, తిరుచూర్ణం ఇందుకు వినియోగిస్తాం. క్రీడాఉద్యానవనాన్ని భూమి మీదకు దించినవాడు గరుడుడు. భూమితో ఆయనకున్న అనుబంధానికి సంకేతంగానే ఎర్రమట్టిని చిత్రరచనలో వాడుతారు. నామంతెలుపు రంగునూ, తిరుచూర్ణం ఎరుపునూ ఇస్తాయి.

1986 నుంచి మొదలు

1979లో టీటీడీలో నేను చేరాను. రిటైరైన తర్వాత కూడా గరుడపటం గీసే అదృష్టం నాకు ఆ స్వామి ఇచ్చాడు. 1986 నుంచీ నేను గరుడచిత్రం గీస్తున్నాను. అంతకు మునుపు టీటీడీకి సంబంధంలేని బయటి చిత్రకారులు దీనిని రూపొందించేవారు. భక్తి శ్రద్ధలతో, నియమనిష్ఠలతో చేయాల్సిన పని ఇది. టీటీడీలో అటువంటి చిత్రకారులు లేరా అని అప్పటి ఆలయ అధికారులు బ్రహ్మోత్సవాల నిర్వహణపై ముందస్తుగా నిర్వహించిన సమావేశంలో అన్నారట. ఉన్నారని భరోసా ఇచ్చినవారు డాలర్ శేషాద్రి. నాకు మంచి మిత్రుడు. నిజానికి ఈ అవకాశం మొదట హెన్రీ గారికి వచ్చింది. ఆయనే నాపేరును సూచించారు. తొలిసారి చిత్రం ప్రారంభించే ముందు జియ్యంగార్లు, ఆలయ అర్చకులు నన్ను కూర్చోబెట్టుకుని గరుడ పటం విశిష్టత గురించి, గరుడుడి ప్రాధాన్యం గురించి చాలా వివరించారు. భక్తితో చేయాల్సిన పని అంటూ అప్పగించారు. అలా మొదలైన గరుడచిత్రకైంకర్యం 40 ఏళ్లుగా కొనసాగుతోంది. స్వామి తనకు సేవచేసేందుకు కొందరిని ఎంచుకుంటాడు. అలాంటివారిలో బహుశా నేనూ ఒకడిని. లేకపోతే రిటైరైన తర్వాత కూడా ఈ అపురూప అదృష్టం నాకు దక్కేదా?



సర్పాలే ఆభరణాలు

చిత్రంలోని గరుడుడికి అలంకారాలుగా అమరేది అష్టమహాసర్పాలు. శిరస్సున కిరీటంలా మారిన శంకువును అల్లుకుని సర్పాలుంటాయి. చెవి రింగులుగా పద్మ, మహాపద్మాలు, కంఠాభరణంగా కర్కోటకుడు, యజ్ఞోపవీతంగా వాసుకి, నడుమును చుట్టుకుని తక్షకుడు, కుడి, ఎడమ చేతులకు కంకణాలుగా గుళికుడు, అనంతుడు ఆభరణాలుగా ఉంటారు.



తిరుమలేశుడికి బ్రహ్మాండోత్సవం

నేటి నుంచి ప్రారంభంకానున్న వాహనసేవలు

పుష్ప, విద్యుత్ అలంకరణతో ముస్తాబైన కొండ

తిరుమల, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): తొమ్మిది రోజులపాటు తిరుమలేశుడికి జరిగే బ్రహ్మాండోత్సవానికి టీటీడీ అంతా సిద్ధం చేసింది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని టీటీడీ దాదాపు రూ.25 కోట్లతో ఏర్పాట్లను చేపట్టింది. పుష్ప, విద్యుద్దీపాలంకరణలతో తిరుమల కొండ భక్తులకు కనువిందు చేస్తోంది. మంగళవారం అంకురార్పణ ఘట్టంతోనే తిరుమలకు బ్రహ్మోత్సవ శోభ సంతరించుకుంది. బుధవారం సాయంత్రం 5.43 నుంచి 6.15 గంటల వరకు మీనలగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం చంద్రబాబు నాయుడు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఇక, రాత్రి 9 నుంచి 11 గంటల వరకు పెద్దశేషవాహన సేవ జరగనుంది. దీంతో ఆలయ నాలుగు మాడవీధుల్లో వాహనసేవలు మొదలు కానున్నాయి. ప్రతిరోజు ఉదయం 8 నుంచి 10 వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు దేవేరులతో కలిసి మలయప్పస్వామి వివిధ వాహనాలపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు. 28వ తేదీన గరుడవాహనం మాత్రం సాయంత్రం 6.30 గంటలకే మొదలుకానుంది.



శ్రీవారి ఆలయం లోపల అలంకరణ

డ్రైనేజీలో విషవాయువు సోకి ఇద్దరు మృతి



డ్రైనేజీ నుంచి కార్మికుల మృతదేహాలను బయటకు తీస్తున్న అగ్నిమాపక దళం

చెన్నై, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి సమీపం తిరువెరుంబూరు వద్ద ముత్తునగర్ గార్డెన్ ప్రాంతంలో భూగర్భ డ్రైనేజీలో పూడిక తీసేందుకు దిగిన ఇద్దరు కార్మికులు విషవాయువు సోకి దుర్మరణం చెందారు. ఆ ప్రాంతంలో భూగర్భ డ్రైనేజీలో మురుగునీరు సరిగా వెళ్లడం లేదని, రోడ్డుపైకి వస్తోందని స్థానికులు కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో మురుగుకాల్వల పనులు చేపట్టే కాంట్రాక్టర్ సుబ్బయ్య దగ్గర పనిచేస్తున్న తిరువెంబూరుకు చెందిన రవి (38), చిన్నసేలంకు చెందిన ప్రభు (32) సోమవారం సాయంత్రం ఆ ప్రాంతానికి వెళ్లారు. కార్పొరేషన్ ఇంజనీర్లు జగజీవన్‌రామ్, ప్రశాంత్ పర్యవేక్షణలో ఆ ఇద్దరు కార్మికులు భూగర్భ డ్రైనేజీలో అడ్డంగా ఉన్న చెత్తను తొలగించేందుకు లోనికి దిగారు. పావు గంట తర్వాత గోతిలో దిగిన కార్మికులను ఇంజనీర్లు బయటకు రమ్మని పిలిచారు. కానీ కార్మికుల నుంచి స్పందన లేదు.. దీంతో అధికారులు గోతిలోపలకు తొంగి చూడగా ఇరువురూ సొమ్మసిల్లి పడి ఉండటం గమనించి వెంటనే పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక దళం హుటాహుటిన అక్కడికి చేరుకుని స్థానికుల సహాయంతో ఇరువురినీ వెలికి తీశారు. అయితే అప్పటికే ఆ ఇద్దరు కార్మికులు మృతి చెందారు. దీంతో మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

ఐటీఐలో విద్యార్థి ర్యాగింగ్

- ముగ్గురు విద్యార్థులపై కేసు

చెన్నై, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఐటీఐలో విద్యార్థిని ర్యాగింగ్ చేసిన వ్యవహారంలో ముగ్గురు విద్యార్థులపై కేసు నమోదుచేశారు. మదురై జిల్లా సేక్కనూరణిలోని ప్రభుత్వ ఐటీఐలో మదురై, దిండుగల్, తేని, విరుదునగర్ తదితర జిల్లాల విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరు బస చేసేందుకు సమీపంలో హాస్టల్ వ ఉంది. ఈ హాస్టల్‌లో ఉంటున్న తేని జిల్లాకు చెందిన 16 ఏళ్ల విద్యార్థిని ఈనెల 18న మదురై జిల్లాకు ఇద్దరు విద్యార్థులు, తేని జిల్లాకు చెందిన మరో విద్యార్థి ర్యాంగింగ్ చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై బాధిత విద్యార్థి తండ్రి సేక్కనూరణి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన పోలీసులు తేని జిల్లాకు చెందిన విద్యార్థిని అదుపులోకి తీసుకుని, మరో ఇద్దరు విద్యార్థుల కోసం గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో, సంబంధిత హాస్టల్ వార్డెన్ బాలమురుగన్‌ను మదురై జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సస్పెండ్ చేశారు.

'ఎర్ర' స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు

తిరుపతి(నేరవిభాగం) సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ ఎర్రచందనం రాష్ట్ర స్థాయి కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. రెడ్ శ్యాండిల్ టాస్క్‌ఫోర్సు చీఫ్ సుబ్బరాయుడు కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లాకు చెందిన అండి 2017లో చామల రేంజ్, నాగపట్ల సెక్షన్, బొబ్బాలబావి పరిధిలో ఎర్రచందనం చెట్లు నరకడానికి అడవిలోకి వెళుతున్నాడు. అప్పట్లో అటవీశాఖ, టాస్క్‌ఫోర్సు అధికారులు దాడులు చేసి అతడిని పట్టుకున్నారు. దీనిపై విచారించి కేసు నమోదు చేశారు. అనంతరం కోర్టు ఎదుట హాజరుపరచగా అతడికి రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ కేసును తిరుపతిలోని రాష్ట్రస్థాయి ఎర్రచందనం కోర్టుకు బదిలీ చేసి కేసు విచారించారు. దీనిపై స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమర నారాయణ వాదనలు వినిపించారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి నరసింహమూర్తి నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. నెల్లూరు సెంట్రల్ జైలుకు నిందితుడ్ని తరలించారు.